క్లుప్తంగా

మంత్రి ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా తీర్మానం



భీమ్‌గల్: రాబోయే ఎన్నికల్లో మంత్రి ప్రశాంత్ రెడ్డికి అండగా ఉంటామని బడా భీమ్‌గల్‌లోని మున్నూరుకాపు రాగుల సంఘ సభ్యులు తీర్మానం చేశారు. గ్రామంలో ఆదివారం సంఘ సభ్యులు సమావేశం నిర్వహించి, బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి ప్రశాంత్‌కి పూర్తి మద్దతుగా ఉండాలని నిర్ణయం తీసుకున్నారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి నాయకత్వంలో బాల్కొండ నియోజకవర్గం ప్రగతి పథంలో దూసుకుపోతుందని సంఘ సభ్యులు వెల్లడించారు. అనంతరం తీర్మాన కాపీని బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రాగుల మోహన్‌కు అందజేశారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



బోధన్: పట్టణంలోని నిజాం షుగర్స్ ఫ్యాక్టరీ ఎదుట కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 30వ రోజు కొనసాగాయి. ఈసందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. ఫ్యాక్టరీ లేఆఫ్ కాలం నుంచి రావాల్సిన బకాయి వేతనాలు చెల్లించి ఆదుకోవాలని, చనిపోయిన కార్మిక కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులు బాసన రుషీ, అన్వర్ మియా తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలో ఆదివారం యాదవ సంఘం ఆధ్వర్యంలో అఖిల భారత యాదవ మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ.. ఆర్మూర్‌లోని క్షత్రియ ఫంక్షన్ హాల్ మంగళవారం యాదవ సంఘం మహాసభలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి జిల్లాలోని సంఘ ప్రతినిధులు హాజరుకావాలని కోరారు. జిల్లా కన్వీనర్ బాబారావు యాదవ్, ఆర్మూర్ కన్వీనర్ జక్కుల రాజమల్లు, మండల అధ్యక్షుడు కిషన్, సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ వేడుకలు




మాక్లూర్: మండలంలోని అమ్రాద్‌తండాలో ఆదివారం గిరిజన ప్రజలు తీజ్‌పండుగను ఘనంగా జరుపుకొన్నారు. బీజేపీ ఆర్మూర్ నియోజకవర్గ నాయకుడు పైడి రాకేష్‌రెడ్డి వేడుకలకు హాజరై, గిరిజనులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. జగదాంబ ఆలయంలో గిరిజనులతో కలిసి పూజలు చేశారు. అనంతరం యువతులు గోదుమ బుట్టలను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువెళ్లి పూజలు నిర్వహించారు. అనంతరం చెరువులో నిమజ్జనం చేశారు.

ఆర్మూర్‌లో వర్షం



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలో శనివారం రాత్రి నుంచి ఉరుములు మెరుపులతో కూడిన వర్షం ఏకధాటిగా కురిసింది. దీంతో పట్టణ ప్రజలు బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. పట్టణంలోని పలు వార్డుల్లో అంతర్గత రోడ్లు చిత్తడిగా మారాయి. బస్టాండ్ సమీపంలో రోడ్డుపై వరద నీరు చేరడంతో ప్రయాణికులు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



ధర్పల్లి: మండలంలోని గోవింద్‌పల్లిలో ఆదివారం వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి పార్టీ కండువాను కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆర్మూర్ బాలరాజ్, డీసీసీ అధికార ప్రతినిధి నర్సయ్య, నాయకులు నరేష్, గంగారాం, బుచ్చన్న, సుభాష్ రెడ్డి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో కానరాని పల్లె వెలుగు

- మాక్లూర్ మండలంలో 15మారుమూల గ్రామాలకు బస్సుసౌకర్యం కరువు
- ఇబ్బందుల్లో పల్లె ప్రజలు
- పట్టించుకోని పాలకులు



మాక్లూర్: నిజామాబాద్ నగరానికి కలిసి ఉన్న మాక్లూర్ మండలంలో అనేక గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గడిచిన 5సంవత్సరాలుగా ప్రతి మారుమూల గ్రామానికి బీటీ రోడ్లు వేసి బస్సు సౌకర్యం కల్పించటంలో పాలకులు విఫలమయ్యారనే విమర్శలు వ్స్తున్నాయి. మండలంలో ఉన్న 36 గ్రామాలకు గాను 15 గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదంటే మారుమూల గ్రామీణ ప్రాంత ప్రజలు ఎంతటి ఇబ్బందులు పడుతున్నారో ఇట్టే అర్థమవుతుంది. ప్రజలు గత్యంతరం లేక ప్రమాదం అని తెలిసిన ఆటోలో ప్రయాణం సాగిస్తున్నారు.

బస్సు కోసం కి.మీ.ల నడక..

వెంకటాపూర్, రాంపూర్, గంగరమంద గ్రామాలకు చెందిన ప్రజలు ఆర్టీసీ బస్సు ఎక్కాలంటే 3 నుండి 4 కిలోమీటర్లు కాలినడుక నడువాల్సిందే.. ఇక్కడి నుంచి బయటకు వెళ్లాలన్న బయటివారు గ్రామానికి రావాలన్న ఇబ్బందులు తప్పవు. టూ వీలర్ వాహనాలు ఉన్నవారికి కొంత మేరకు ఇబ్బందులు లేకపోయిన ఏ వాహనం లేని పేద ప్రజలు మాత్రం కాలినడకతోనే వెళ్లివస్తున్నారు. అలాగే మాందపూర్, ధర్మోరా, బొంకన్‌పల్లి, గొట్టిముక్కల, ముల్లంగి వంటి గ్రామాలకు బస్సు సౌకర్యం లేక పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. నిజామాబాద్ నుంచి బొంకన్‌పల్లి ద్వారా ధర్మోరాకు ఒక్క ఆర్టీసీ బస్సు నడుపుతున్నా అది కేవలం విద్యార్థుల కొరకే వచ్చి వెళుతుందని, మళ్లీ సాయంత్రం ట్రిప్పు వస్తుందో రాదో కూడ తెలియదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెలవు దినాల్లో అయితే అసలే రాదంటున్నారు. చిన్నాపూర్, రాంచంద్రపల్లి, అమ్రాద్‌తాండ, సట్లాపూర్ తండాలకు బస్సు సౌకర్యం లేక కిలోమీటర్ల కొద్ది నడుస్తూ పనులు వెల్లదీసుకుంటున్నారు. గుంజ్లి, వల్లభాపూర్, మెట్‌పల్లి ప్రజలకు బస్సు తిప్పలు తప్పడం లేదు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులైతే 3 కిలోమీటర్లు నడిచి గొట్టిముక్కల పాఠశాలకు వెళుతున్నారు. బస్సు విషయమై ఆయా గ్రామాల ప్రజలు అధికారులను, ప్రజాప్రతినిధులను పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైన పాలకులు, అధికారులు స్పందించి మండలంలో బస్సు సౌకర్యం లేని గ్రామాలన్నింటికీ వెంటనే ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

బస్సు లేక తిప్పలు పడుతున్నాం..

మా ఊరికి పదేండ్ల కింద ఆర్టీసీ బస్సు నిజామాబాద్ నుంచి బొంకన్‌పల్లి ద్వారా మూడు సార్లు వచ్చి వెళ్లేది. అప్పట్లో 11గంటల బస్సుకు పోయి పనులు చేసుకొని సాయంత్రం బస్సుకు వచ్చేటోళ్లం. ఇప్పుడు అ బస్సు బంద్ చేసి చాలా ఏండ్లు అయింది. మా పిల్లలు స్కూలుకు వెళ్లటం కూడా ఇబ్బంది అవుతుంది. మేము కూడా బస్సు సౌలత్ లేక జన్నేపల్లి వరకు నడుచుకుంటూ వెళ్లి బస్సు ఎక్కిపోతున్నాం. పెద్దసార్లు దయ ఉంచి మాకు బస్సు సౌలత్ కల్పించాలి.

–సుంకరి నారాయణ, వల్లభాపూర్, మాక్లూర్

రుణమాఫీపై రైతులకు స్పష్టత ఇవ్వాలి



రైతులతో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

రెంజల్(బోధన్): రుణమాఫీపై రాష్ట్ర ప్రభుత్వం రైతులకు స్పష్టమైన వివరణ ఇవ్వాలని మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి సూచించారు. మండలంలోని బాగేపల్లి, కూనేపల్లి, రెంజల్, సాటాపూర్ గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించి, రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం రూ. లక్ష వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించినా, క్షేత్రస్థాయిలో రైతులు అయోమయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు బ్యాంకులకు, సొసైటీలకు నిర్దిష్టమైన ఆదేశాలను అందించలేదన్నారు. రుణమాఫీ లభించిన రైతుల ఖాతాలకు ఎప్పుడు తిరిగి మాఫీ డబ్బులను చెల్లిస్తారని ప్రశ్నించారు. డబుల్ బెడ్ రూంలు అందక సామాన్యులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. నాయకులు మొబిన్‌ఖాన్, రాములు, ఎంఎల్ రాజు, జావీదోద్దిన్, గంగాకిషన్, గయాస్, శ్రీనివాస్, నితిన్, సాయిబాబగౌడ్, ఇందిరారెడ్డి,క్రిష్ణ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయం కోసం కృషి చేయాలి



సాలూర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవికి నియామక పత్రం అందిస్తున్న సుదర్శన్‌రెడ్డి

బోధన్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం కోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలని, పార్టీ మేనిఫెస్టో అంశాలను, బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో తీసుకెళ్లాలని టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ పేర్కొన్నారు. సాలూర మండల కేంద్రంలో ఆదివారం ఆయన కాంగ్రెస్ మండల నూతన కమిటీ ఎన్నిక కోసం సమావేశం నిర్వహించారు. అనంతరం సాలూర మండల కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ అధ్యక్షుడిగా మందర్న గ్రామానికి చెందిన హున్సా సహకార సంఘం చైర్మన్ మందర్న రవి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సాలూర గ్రామానికి చెందిన టింకల్ హన్మంత్‌రావుపటేల్ (బీహారి)ని ఎన్నుకున్నారు. బోధన్ మండల నూతన అధ్యక్షుడిగా పెంటాకుర్దు క్యాంప్‌కు చెందిన మాజీ సర్పంచ్ నాగేశ్వర్‌ను ఎన్నుకున్నారు. అనంతరం నిజామాబాద్‌లో మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి వారికి నియామకపత్రాలను అందించారు. పార్టీ నాయకులు అల్లె రమేష్, దొడ్ల రవీందర్ రెడ్డి, చిద్రపు అశోక్, ఇల్తెపు రమేష్, తగ్గెల్లి దేవ్‌రావు, బుద్దె లక్ష్మణ్, రావుల లక్ష్మణ్, చిద్రపు రాములు, మాజీ ఎంపీటీసీ పల్లె గంగారాం పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా రైతుబజార్



రైతుబజార్ ఆవరణలో మద్యం సీసాలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కూరగాయ మార్కెట్ వద్ద నిర్మించిన రైతుబజార్ ప్రారంభానికి నోచుకోకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారింది. ప్రతిరోజు ఉదయం నుంచి రాత్రి వరకు కొందరు మందుబాబులు రైతుబజార్ ఆవరణలో మద్యం తాగుతూ, సీసాలను ధ్వంసం చేసి పారేస్తున్నారు. ఈక్రమంలో రైతుబజార్ ఆవరణలో వ్యాపారులు, వినియోగదారులకు సీసాముక్కలు గుచ్చుకొని గాయాల పాలవుతున్నారు. అలాగే మూగజీవుల సైతం గాయాలపాలవుతున్నాయి. రైతుబజార్‌కు సెక్యూరిటీ లేకపోవడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సెక్యూరిటీని నియమించాలని, పోలీసులు ప్రతిరోజు రాత్రి సమయంలో రైతుబజార్‌లో పెట్రోలింగ్ చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

- అదనపు కలెక్టర్లు యాదిరెడ్డి, చిత్రామిశ్రా
- పలు మండలాల్లో పోలింగ్‌బూత్‌ల పరిశీలన



చందూర్‌లో ఓటరు నమోదును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, ఆర్డీవో రాజాగౌడ్

రుద్రూర్/వర్ని: అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా పేరు నమోదు చేసుకునేలా చూడాలని అదనపు కలెక్టర్ యాదిరెడ్డి సూచించారు. రుద్రూర్, వర్ని, మోస్రా, చందూర్ మండలాల్లో ఆదివారం ఆయన పలు పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఎంతమంది పేర్లు నమోదు చేసుకున్నారని సిబ్బందిని ప్రశ్నించారు. సేకరించిన దరఖాస్తులను పరిశీలించారు. ఓటరు జాబితాలో పేర్లు తొలగించే విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఓటర్ లిస్టులో చనిపోయిన వ్యక్తుల పేర్లను ఓటర్ లిస్ట్ నుంచి తొలగించాలన్నారు. బోధన్ ఆర్డీవో రాజాగౌడ్, తహసీల్దార్లు. వెంకటేశం, కరణం శ్రీకాంత్ రావు, బీఎల్‌వోలు ఉన్నారు.

కోటగిరిలో...

కోటగిరిలో పోలింగ్ బూత్‌లను ఆదివారం బాన్సువాడ ఆర్డీవో భుజంగ్‌రావ్ పరిశీలించారు. ఓటరు నమోదు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. వివిధ కారణాల వల్ల ఎక్కడైన పోలింగ్ కేంద్రాలు మారినట్టయితే ఓటర్లకు తెలియజేయాలన్నారు. కోటగిరి తహసీల్దార్ ప్రభాకర్, సిబ్బంది ఉన్నారు.

మెండోరా మండలంలో

బాల్కొండ: మెండోరా మండలంలోని చాకీర్యాల్, పోచంపాడ్ గ్రామాల్లో ఓటరు నమోదు కేంద్రాలను అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరునమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రజలు ప్రత్యేక శిబిరాలను వినియోగించుకోవాలన్నారు. తహసీల్దార్ సంతోష్, ఆర్ఐ సాయాగౌడ్, తదితరులు ఉన్నారు.

వేల్పూర్ మండలంలో..

వేల్పూర్: మండలంలోని పడగల్, లక్కోర గ్రామాలలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ నాగార్జున పరిశీలించారు. దరఖాస్తుల గురించి బూత్‌లెవల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటరు నమోదులో ఎటువంటి పొరపాట్లు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని బీఎల్‌వోలకు సూచించారు. ఆర్ఐ వేణు తదితరులు ఉన్నారు.







చాకీర్యాల్‌లో పోలింగ్‌బూత్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా.. పడగల్‌లో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగార్జున.. రుద్రూర్‌లో..

సోయా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



ఉప్లూర్‌లో పంటలను పరిశీలిస్తున్న సునీల్‌రెడ్డి

కమ్మర్‌పల్లి: బాల్కొండ నియోజకవర్గంలో సోయా పంటకు తెగుళ్లు సోకి అపారమైన నష్టం జరిగిందని, ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని కాంగ్రెస్ నేత ముత్యాల సునీల్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని ఉప్లూర్‌లో ఆదివారం అయన సోయా పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా సునీల్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం, మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఏనాడూ రైతులను పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రైతులకు న్యాయం జరుగుతుందని, పంటలకు మద్దతు ధరలు, పంట నష్టపరిహారాలు అందుతాయని తెలిపారు. నాయకులు రవి, ప్రవీణ్, మనోహర్, రమేష్, శ్రీధర్, రేవతి గంగాధర్, నర్సయ్య పాల్గొన్నారు.

సంక్షిప్తం

గొడుగుల పంపిణీ



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలో గ్రామస్తులకు ఆదివారం బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు గొడుగులను పంపిణీ చేశారు. ఉపసర్పంచ్ ఆసపురం శ్రీనివాస్‌రెడ్డి, సొసైటి చైర్మన్ సోమ హెమంత్‌రెడ్డి, ఎంపీటీసీ సామెర సురేష్ పాల్గొన్నారు.

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీసేవ నిర్వహిస్తామని తెలిపారు.

చర్చిలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో ఎడ్యుకేషనల్ సండేలో భాగంగా ఆదివారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలతోపాటు ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను సన్మానించారు.



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని సీఎస్ఐ సెయింట్ పీటర్స్ చర్చిలో ఆదివారం ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో పని చేస్తున్న 40మంది ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో చర్చి నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

దోషులను శిక్షించాలి

ఆర్మూర్‌టౌన్: మంచిర్యాల జిల్లా మందమర్రిలో మేక పోయిందన్న అనుమానంతో దళిత యువకుడిని కొట్టిన ముగ్గురు వ్యక్తులను కఠినంగా శిక్షించాలని దళిత ఐక్య సంఘటన ఆర్మూర్ డివిజన్ నాయకులు కోటేశ్వర్, అశోక్, చంద్రయ్య, పెద్ద భోజన్న, కుమారస్వామి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇలాంటి టనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.

రామచంద్రన్ వర్ధంతి సభ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మెడికల్ అసోసియేషన్ భవన్‌లో ఆదివారం రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు బొట్ల గంగారాం అధ్యక్షతన రామచంద్రన్ 15వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ రామచంద్రన్ పార్టీ ఉత్తర తెలంగాణ కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ.. దేశంలో విప్లవ సంస్థలన్నింటినీ ఐక్యం చేయడంలో రామచంద్రన్ ఎంతో కృషిచేశారన్నారు. రామచంద్రన్ కన్న కలల్ని నిజం చేయాలని కోరారు. పార్టీ నాయకులు చిట్టిబాబు, మహమూద్, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు కాలనీలో శ్రమదానం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో ఆదివారం కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కాలనీవాసులు శ్రమదానం చేపట్టారు. ఈసందర్భంగా హనుమాన్ ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. రోడ్లకు ఇరువైపులా పిచ్చిమొక్కలను తొలగించారు. కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గొసికొండ అశోక్, పుప్పాల శివరాజ్, భూమన్న, సుంకె శ్రీనివాస్, రాజు, పవన్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

పవిత్ర మట్టి అందజేత



బోధన్: పీఎం మోదీ పిలుపు మేరకు అమృత వాటిక స్మృతి వనం నిర్మాణం కోసం బీజేపీ నాయకులు పలు గ్రామాల్లో సేకరించిన పవిత్ర మట్టిని ఆదివారం సాలూర మండలంలోని హున్సా సోమేశ్వరాలయంలో బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు అడ్లూరి శ్రీనివాస్‌కు అందజేశారు. పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోనే ప్రవీణ్, సాయినాథ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

12న మెగా జాబ్ మేళా

వేల్పూర్: మండలంలోని లక్కోరలో గల ఏఎన్‌జీ ఫంక్షన్ హాలులో ఈనెల 12న బాల్కొండ నియోజకవర్గ యువతీయువకుల కోసం మంత్రి ప్రశాంత్‌రెడ్డి చొరవతో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాలో 70కి పైగా కంపెనీలు పాల్గొని 4వేలకు పైగా ఉద్యోగులను భర్తీ చేసుకుంటాయని వెల్లడించారు. ఐటీ, ఐటీఈఎస్, మేనేజ్‌మెంట్, బ్యాంకింగ్, ఫార్మా, మార్కెటింగ్, మాన్యూఫాక్చరింగ్, ఇతర రంగాలలో ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, పీజీ, బీఫార్మసీ, ఎంఫార్మసీ, ఎంసీఏ, ఎంబీఏ, బీటెక్, ఎంటెక్ చదివిన యువతీ, యువకులు జాబ్‌మేళాలో ఉచితంగా పాల్గొనవచ్చన్నారు. వివరాలకు 91001 20691ను సంప్రదించాలని తెలిపారు.

శంఖారావానికి తరలిన పద్మశాలీలు



బాల్కొండ: హైదరాబాద్‌లో నిర్వహించిన పద్మశాలీల శంఖారావానికి ముప్కాల్‌లోని పద్మశాలీలు ఆదివారం భారీగా తరలి వెళ్లారు. సంఘ ప్రతినిధులు చిలుక రఘు, దినేష్, నరేశ్ ఉన్నారు.

బోధన్‌లో ఉర్సు ప్రారంభం

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని జలాల్ బుకారి దర్గా ఉర్సును శనివారం రాత్రి ఘనంగా ప్రారంభించారు. ఉత్సవాలను మున్సిపల్ వైస్ చైర్మన్ సోహేల్, నిర్వాహకులు ప్రారంభించారు. ఈసందర్భంగా చాదర్‌ను దర్గాపై కప్పి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆదివారం దర్గాలో దీపారాధన నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా జాతర సైతం కొనసాగుతోంది. ఆదివారం రాత్రి ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ దర్గాను సందర్శించారు.

ఎమ్మెల్యే చాదర్‌ను దర్గాపై కప్పి మత పెద్దలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే నిర్వాహకులకు సూచించారు.





బోధన్‌లో ఉత్సవాలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు.. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే

నూతన కార్యవర్గం ఎన్నిక



మాల మహానాడు నూతన కమిటీ సభ్యులు

రుద్రూర్: పోతంగల్ మండల కేంద్రంలో ఆదివారం మాల మహానాడు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సోన్‌కాంబ్లే రాహుల్ (సోంపూర్), ప్రధాన కార్యదర్శిగా గైని వీరేశం(పోతంగల్), ఉపాధ్యక్షుడిగా విద్యాసాగర్(చేతనగర్), కోశాధికారిగా సోన్ కాంబ్లేయాదవ్ (సుంకీని), సంయుక్త కార్యదర్శిగా నీరడీ లక్ష్మణ్ (కొడిచర్ల), సోషల్ మీడియా ఇన్‌చార్జిగా కాలే శివ, సలహాదారులుగా నాగనాథ్ ఎన్నికయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నీరడి రవి, మదాసు శ్రావణ్ కుమార్, దేవేందర్, శ్రీకారం స్వామి, వాగ్మారే సంజీవ్, నీరడి ఈశ్వర్ పాల్గొన్నారు.

పీఆర్సీ బకాయిలు చెల్లించాలి



ఆర్మూర్‌టౌన్: ప్రభుత్వం గత సంవత్సరం ప్రకటించిన పీఆర్సీ 8నెలల బకాయిలను వెంటనే చెల్లించాలని బహుజన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దండి వెంకట్ డిమాండ్ చేశారు. పట్టణంలోని శ్రీలక్ష్మి నర్సింహాస్వామి ఆలయ ప్రాంగణంలో గల కల్యాణ మండపంలో ఆదివారం ఆయన మున్సిపల్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు ప్రతి నెల వేతనాలు ఇవ్వాలన్నారు. 7మందికి గ్రూప్‌లను రద్దు చేసి 220 మంది కార్మికులను రెండు గ్రూపులుగా ఏర్పరచి నిజామాబాద్ తరహా కార్మికుల గ్రూపులు ఏర్పాటు చేసి వేతనాలు ఇవ్వాలన్నారు. అనంతరం బీఏల్‌టీయూ ఆర్మూర్ మున్సిపల్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా బ్యాగరి ఆశోక్, రాజేశ్వర్, సహాయ కార్యదర్శి చిన్నుబాయి, ఉపాధ్యక్షుడు పాండు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.